సుభాష్‌నగర్, జూలై 28: పులోరియా.. పులోరియా.. అంటూ భక్తుల హోరుతో ఇందూరు నగరం పునీతమైంది. పోతరాజుల చిందులు, శివసత్తుల పూనకాలు, తొట్లెల ఊరేగింపుతో సందడి నెలకొన్నది. ఆదివారం ఊరపండుగను పురస్కరించుకొని నిజామాబాద్ నగరం జనసంద్రమైంది. ఊర పండుగలో ప్రధానమైన పదార్థం సరిని నగరవాసులు తమ ఇండ్లపై, పొలాల్లో ఎంతో భక్తిప్రపత్తులతో చల్లుకున్నారు. పిల్లాజెల్ల, పాడిపంట, గొడ్డూగోజ అంతా చల్లగా ఉండేలా చూడు తల్లీ అంటూ.. అమ్మవార్లను వేడుకున్నారు. అమ్మవారి తొట్లెలు, బండారి సమర్పణలు, గుగ్గిలం పొగలు, కల్లు సాకలు,యాటల బలులు, డప్పుల దరువులు, పోతరాజుల విన్యాసాలు, భక్తుల పూనకాలు, భవిష్యవాణి.. ఇలా జిల్లాకేంద్రంలో తెలంగాణ సంస్కృతి ప్రతిబింబించింది. ఖిల్లా రఘునాథ్ ఆలయం వద్ద ఉన్న శారదాంబ గద్దె (తేలు మైసమ్మ గద్దె) వద్ద గ్రామ దేవతలను ప్రతిష్ఠించారు. పూజారులు పసుపు, కుంకుమ, చెవిపోగులు, గాజులు, ఆభరణాలతో అలంకరించి పూజలు నిర్వహించారు. దేవతామూర్తులను ఊరేగింపుగా గాజులపేట్ చౌరస్తా మీదుగా పెద్దబజార్ చౌరస్తా నుంచి రెండు బృందాలుగా విడిపోయి ఒక బృందం పొడలమ్మ, నల్లపోచమ్మ, అడెల్లి పోచమ్మ, పెద్దమ్మ, పులిరాజులు, రాట్నం, తొట్లెలతో దుబ్బ వైపు ఊరేగింపుగా వెళ్లింది. రెండో బృందం సిర్నాపల్లి గడి, గోల్ హనుమాన్ చౌరస్తా మీదుగా వినాయక్‌నగర్‌లోని ఐదు చేతుల పోచమ్మ, మత్తడి పోచమ్మ, మహాలక్ష్మమ్మ ఆలయం వైపు వెళ్లింది. సరిని దక్కించుకోవడం కోసం భక్తులు పోటీపడ్డారు. పూజల్లో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, నగర మేయర్ నీతూకిరణ్, సర్వసమాజ్ అధ్యక్షుడు యెండల లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు



సరి(ప్రసాదం) వద్ద భక్తుల కోలాహలం

# పులోరియా..

- ఘనంగా ఊరపండుగ
- జనసంద్రమైన ఇందూరు
- ఆకట్టుకున్న పోతరాజుల విన్యాసాలు
- సరి కోసం పోటీపడ్డ భక్తులు

పోతరాజుల విన్యాసాలు



అంతా సరింగ ఉండాలని..



గ్రామదేవత విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకెళ్తున్న భక్తులు





ఖిల్లా తేలు మైసమ్మ గద్దె వద్ద భక్తుల సందడి

ఖిల్లా తేలు మైసమ్మ గద్దె వద్ద భక్తుల సందడి



## సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

ఎల్లారెడ్డి క్యాంపు కార్యాలయంలో ఎంపీ సురేశ్ షట్కార్, ఎమ్మెల్యే మదన్‌మోహన్ సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఆదివారం పంపిణీ చేశారు. ఎనిమిది మండలాలకు చెందిన 113 మందికి రూ.50లక్షల విలువజేసే చెక్కులను అందజేశారు.

– ఎల్లారెడ్డి, జూలై 28

## 'గురుకులం'లో మిగిలిన సీట్ల భర్తీకి స్పాట్ అడ్మిషన్లు

డిచ్‌పల్లి, జూలై 28 : రీజియన్‌లోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలల్లో ఇంటర్ మొదటి సంవత్సరంలో మిగిలిన సీట్లలో ప్రవేశాల కోసం ఈనెల 30న స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు ధర్మారం (బీ) పాఠశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 2024లో పదోతరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థినులు అర్హులని పేర్కొన్నారు. అర్హులు సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల కళాశాల (సీవోఈ), ధర్మారం(బీ) కళాశాలల్లో ఉదయం 10 గంటలకు నిర్వహించే కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని సూచించారు. నవీపేట్ స్కూల్‌లో ఎస్సీ-8, మైనార్టీ-1, కామారెడ్డి జిల్లాలోని బాన్సువాడలో ఎస్సీ 6, ఎస్‌సీసీ-1, మైనార్టీ-1, ఓసీ-1, తాడ్కోల్‌లో ఎస్సీ-10, ఓసీ-1, తాడ్వాయిలో ఎస్సీ-7, ఎస్‌సీసీ-1, ఓసీ-1, తక్కడపల్లిలో ఎస్సీ-8, ఎస్‌సీసీ-1, మైనార్టీ-1, దోమకొండలో ఎస్సీ-5, మైనార్టీ-1 ఎంపీసీలో, ఎక్లారా స్కూల్‌లో సీఈసీలో ఎస్సీ-36 సీట్లు ఉన్నాయని వివరించారు.



## ఒలింపిక్స్‌లో నిఖత్ శుభారంభం..

కంఠేశ్వర్, జూలై 28 : పారిస్‌లో జరుగుతున్న ఒలింపిక్స్‌లో భారత బాక్సర్ నిఖత్ జరీన్ తొలి విజయం సాధించింది. 50 కిలోల విభాగంలో జర్మనీకి చెందిన మ్యాక్సీ కరినాను ఓడించింది. ప్రత్యర్థిపై 5:0 తేడాతో విజయం సాధించి 16వ రౌండ్‌కు క్వాలిఫై అయ్యింది. నిజామాబాద్‌కు చెందిన నిఖత్ జరీన్ విజయం సాధించడంతో జిల్లాలోని క్రీడాభిమానులు హర్షం వ్యక్తంచేస్తూ అభినందనలు తెలిపారు.

# సర్కారీ దవాఖాన కిటకిట

- విస్తరిస్తున్న విషజ్వరాలు.. పెరుగుతున్న రోగులు
- నిజామాబాద్ జీజీహెచ్‌కు 1700లకు పైగా ఓపీ





జీజీహెచ్‌లో రోగులతో కిటకిటలాడుతున్న వార్డు

ఖలీల్‌వాడి, జూలై 28: విష జ్వరాలు విజృంభిస్తున్నాయి. సీజనల్ వ్యాధులు పంజా విసురుతున్నాయి. దీంతో నిజామాబాద్ జిల్లాలోని దవాఖానలు రోగులతో కిటకిటలాడుతున్నాయి. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ దవాఖాన (జీజీహెచ్)లో రోగుల సంఖ్య పెరుగుతున్నది. ప్రస్తుతం ఓపీ సంఖ్య 1700లకు పైగా నమోదవుతున్నవున్నట్లు తెలిసింది. ఇక, జిల్లావ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ దవాఖానలతో పాటు ప్రైవేట్ దవాఖానలకు రోగుల తాకిడి పెరిగింది. వాతావరణ మార్పులతో పాటు నీటి నిల్వ కారణంగా దోమలు పెరిగి వ్యాధులు విజృంభిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే జిల్లా దవాఖానలో ప్రత్యేకంగా ఫీవర్ వార్డు ఏర్పాటు చేయగా, రోగులతో కిటకిటలాడుతున్నది. మరోవైపు, ప్రస్తుత పరిస్థితులను ప్రైవేట్ దవాఖానలు సొమ్ము చేసుకుంటున్నాయి. విచ్చలవిడిగా బిల్లులు వేస్తూ దండుకుంటున్నాయి. మరోవైపు, ప్రభుత్వ దవాఖానల్లోనే అంటే జీజీహెచ్‌లో చేయాల్సిన డెంగీ పరీక్ష (ఎలిసా టెస్ట్)లను నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేట్‌లో చేస్తున్నారు. సాధారణ జ్వరాలను సైతం డెంగీ పేరు చెప్పి, ప్లేట్‌లెట్స్ పడిపోయాయని రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు బిల్లులు వేస్తున్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖాన, మెడికల్ కాలేజీలో పని చేసే కొందరు వైద్యులు, ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు.. ప్రైవేట్‌గా ప్రాక్టీస్ చేస్తున్నారు. జీజీహెచ్‌లో అన్ని వసతులు ఉన్నప్పటికీ సదరు వ్యక్తులు.. బాధితులను తమ సొంత దవాఖానకు తరలించి వారి నుంచి దండుకుంటున్నారు.

### ఆందోళన చెందొద్దు..

అన్ని పీహెచ్‌సీల్లో మందులు పుష్కలంగా ఉన్నాయి. ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. జిల్లాలో ఈ సీజన్‌లో అత్యధికంగా డెంగీ కేసులు నమోదైనప్పటికీ ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. ఇప్పటికే వైద్యారోగ్య శాఖ, మున్సిపల్ అధికారులను సమన్వయం చేస్తూ పరిసరాల శుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం.

**- తుకారాం రాథోడ్, డీఎంహెచ్‌వో, నిజామాబాద్**

### ఫీవర్ వార్డు ఏర్పాటు చేశాం



దవాఖానలో ఫీవర్ వార్డు ఏర్పాటు చేశాం. అన్ని వసతులు కల్పించాం. ఓపీ ఎక్కువగా ఉండడంతో దవాఖానలో ప్రత్యేక వార్డు ఏర్పాటు చేశాం. ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నాం. ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

**- డాక్టర్ ప్రతిమారాజ్, సూపరింటెండెంట్, జీజీహెచ్**

# కేసీఆర్‌తోనే రైతుల సంతోషం..

### బట్టాపూర్‌లో కేసీఆర్, వేముల చిత్రపటాలకు క్షీరాభిషేకం

ఏర్గట్ల, జూలై 28: రైతులు సంతోషంగా ఉండాలంటే అది తెలంగాణ తొలి సీఎం కేసీఆర్‌తోనే సాధ్యమవుతుందని బీఆర్‌ఎస్ నాయకులు అన్నారు. ఏర్గట్ల మండలంలోని బట్టాపూర్ గ్రామంలో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో కేసీఆర్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి చిత్రపటాలకు ఆదివారం క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఎనుగందుల రాజా పూర్ణానందం మాట్లాడుతూ రైతులు పచ్చని పంటలు పండించి సంతోషంగా ఉండాలనే ఉద్దేశంతో కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించారన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత చిన్నపాటి కారణాలతో ప్రాజెక్టు నుంచి నీళ్లను వదలకుండా రైతులను ఇబ్బందిపెట్టిందన్నారు. సాగు నీరు వదలకపోతే 50వేల మంది రైతులతో తరలివచ్చి మోటర్లు ఆన్‌చేస్తామని ఇటీవల బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇచ్చిన అల్టిమేటంతో ప్రభుత్వం దిగి వచ్చిందన్నారు. 24గంటల్లోనే ఎల్లంపల్లి నుంచి మిడ్‌మానేరు(శ్రీ రాజరాజేశ్వర) ప్రాజెక్టు వద్ద నీటి విడుదలను శనివారం ప్రారంభించిందని, దీంతో రైతుల ముఖంలో సంతోషం నెలకొన్నదన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు కూతురు చిన్నసాయన్న, నాయకులు మాస్ గంగాధర్, తొర్తి మాజీ సర్పంచ్ కుండ నవీన్, ఉగ్గెర చిన్నయ్య, రాజేశ్వర్, తిరుపతి, ధనాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణ తొలి సీఎం కేసీఆర్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

# ముసురు వాన

### వారం రోజులుగా మబ్బులు

ఖలీల్‌వాడి/కామారెడ్డి, జూలై 28: అల్పపీడన ప్రభావంతో ఉమ్మడి జిల్లాల్లో ముసురేసింది. తేలికపాటి జల్లులు కురుస్తూనే ఉన్నాయి. వారం రోజులుగా ఆకాశం మేఘావృతమై వాతావరణం చల్లగా మారింది. మరో మూడు రోజులపాటు భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు ప్రకటించారు. జిల్లా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అత్యధికంగా నవీపేట్ 15.0, డిచ్‌పల్లి 14.4. భీమ్‌గల్ 13.1, మోస్రా 13.2, సిరికొండ 12.1, సాలూరా 12.8, నందిపేట్ 12.3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా అత్యల్పంగా ఆలూర్ 6.7, డొంకేశ్వర్ 7.0, నిజామాబాద్ నార్త్ 7.6, కమ్మర్‌పల్లిలో 7.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. 24 గంటలపాటు జిల్లాలో సగటు 11.2 వర్షపాతం నమోదైనట్లు అధికారులు పేర్కొన్నారు. కామారెడ్డి జిల్లాలో అత్యధికంగా భిక్కనూర్‌లో 25.3, రాజం పేటలో 23.8,కామారెడ్డిలో 21, గాంధారి లో 18.8, తాడ్వాయిలో 18,మద్నూర్‌లో 15.8,అత్యల్పంగా నిజాంసాగర్‌లో 2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

**ఎస్సారెస్పీలోకి కొనసాగుతున్న ఇన్‌ఫ్లో..**

మోర్తాడ్, జూలై 28: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి ఎగువ నుంచి ఆదివారం 20,370 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతున్నది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటి మట్టం 1091 అడుగులు(80.5టీఎంసీలు) కాగా, ఆదివారం ప్రాజెక్టులో 1074.9అడుగులు (32.657 టీఎంసీల) నీటి నిల్వ ఉన్నది. ప్రాజెక్ట్ నుంచి 624 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో కొనసాగుతున్నది. సరస్వతీ కాలువకు 10క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. 383 క్యూసెక్కుల నీరు ఆవిరవుతున్నట్లు అధికారులు తెలిపారు.

# అవినీతి అధికారులు జాగ్రత్త!

- లంచం తీసుకుంటే కఠిన చర్యలు
- జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంత్‌రావు

బాన్సువాడ,జూలై 28: అవినీతి అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు స్పష్టం చేశారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. జుక్కల్ నియోజకవర్గంలోని రెవెన్యూ డిపార్టుమెంట్‌లో కొంతమంది ఉద్యోగులు లంచాలు తీసుకుంటూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు తన దృష్టికి వచ్చినట్లు తెలిపారు. ఇలాంటివాటిని ఎట్టిపరిస్థితుల్లో ఉపేక్షించేదిలేదని, ప్రజలకు సేవ చేయడం ప్రభుత్వ అధికారుల బాధ్యత అని పేర్కొన్నారు. లంచాలు తీసుకుంటున్న ప్రతి ఒక్కరి చిట్టా తన వద్ద ఉన్నదని, పనితీరు మార్చుకోవాలని హితవుపలికారు. గుంట, రెండు లేదా మూడు గుంటల భూమికి రిజిస్ట్రేషన్ చేయడానికి రకరకాలు ఇబ్బందులు పెడుతూ రూ. రెండు వేలు, మూడు వేలు డిమాండ్ చేయడం మంచిదికాదన్నారు. ఏ ఒక్కరూ ఒక్క రూపాయి కూడా లంచం ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. ఎవరైనా లంచం తీసుకుంటున్నట్లు తెలిస్తే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు.